సాక్షి అనంతపురం

గురువారం । 4 । ఏప్రిల్ । 2024



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 4.56



న్యూస్‌రీల్

ర్యాండమైజేషన్ జాగ్రత్తగా చేపట్టాలి



సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఈవీఎంల ర్యాండమైజేషన్ జాగ్రత్తగా చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. స్థానిక టవర్‌క్లాక్ సమీపంలో పాత ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను ఇన్‌చార్జ్ కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈవీఎంల ర్యాండమైజేషన్‌కు చేపట్టిన ఏర్పాట్లు పరిశీలించారు. ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు, టేబుళ్ల అవసరం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఈవీఎం మేనేజ్‌మెంట్ కమిటీ నోడల్ అధికారి, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో నిర్వహించిన బీటెక్ ఫలితాలు విడుదలయ్యాయి. జనవరి, ఫిబ్రవరి నెలలో జరిగిన బీటెక్ ఒకటో సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్-23) రెగ్యులర్, (ఆర్-20), (ఆర్-19), (ఆర్-15) సప్లిమెంటరీ, బీటెక్ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-23), రెగ్యులర్ (ఆర్-20), (ఆర్-19), (ఆర్-15),సప్లిమెంటరీ, లాస్ట్‌ఛాన్స్, ఎంఫార్మసీ ఒకటో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవరెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

వడగాలుల తీవ్రత పెరిగే అవకాశం

అనంతపురం అగ్రికల్చర్: రాగల మూడు రోజులూ వడగాల్పుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ బి.సహదేవరెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, జిల్లా అంతటా బుధవారం వేసవితాపం తీవ్రస్థాయిలో కొనసాగింది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తాడిపత్రి, శింగనమలలో 43.1 డిగ్రీలు, గుంతకల్లు 42.4 డిగ్రీలు, బొమ్మనహాళ్ 41.9 డిగ్రీలు ఉండగా మిగతా ప్రాంతాల్లో 39 నుంచి 41 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. కంబదూరులో 21.9 డిగ్రీల కనిష్టం నమోదు కాగా మిగతా మండలాల్లో 22 నుంచి 27 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. తేమశాతం ఉదయం 40 నుంచి 45, మధ్యాహ్న సమయంలో 20 నుంచి 25 శాతం మధ్య రికార్డయింది.







పింఛన్ కోసం అనంతపురంలోని ఓ సచివాలయానికి వచ్చిన దివ్యాంగుడు, రాయదుర్గం కోతిగుట్ట సచివాలయం వద్ద బారులు తీరిన పింఛన్ దారులు, మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దంటూ చంద్రబాబును వేడుకుంటున్న కంబదూరుకు చెందిన పింఛన్‌దారులు

కళ్లు చల్లబడ్డాయా బాబూ!





భగభగ మండే ఎండలో కాలినడకన వెళ్తున్న వీరంతా పింఛన్‌దారులు. గుమ్మఘట్ట మండలం ఎర్రంపల్లి గ్రామానికి చెందిన వీరికి గత నెల వరకూ ఇంటి వద్దనే పింఛన్ అందేది. అయితే, టీడీపీ అధినేత చంద్రబాబు పన్నిన పన్నాగంతో నేడు ఆ సౌకర్యం రద్దయ్యింది. దీంతో ఇదిగో ఇలా పింఛన్ డబ్బు కోసం తమ గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూపసముద్రం గ్రామ సచివాలయానికి వెళ్లాల్సి వచ్చింది.



ఇంటి ముందు దిగాలుగా కూర్చున్న ఈయన పేరు గంగన్న. వయసు 85 సంవత్సరాలు. కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్ది గ్రామం. అంధుడైన ఈయనకు ప్రభుత్వం ద్వారా పింఛన్ వస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే గంగన్న ఇంటి వద్దకే గ్రామ వలంటీర్ వచ్చి డబ్బు అందించేవారు. గతంలో టీడీపీ హయాంలో పడిన కష్టాలు దూరమవడంతో గంగన్న ఎంతో సంతోషంగా ఉండేవారు. అయితే, నేడు చంద్రబాబు కుటిల బుద్ధి కారణంగా మళ్లీ పాత కష్టాలు ప్రారంభం కావడంతో గంగన్న ఆవేదన వ్యక్తం చేశారు.



ఒంట్లో సత్తువ లేకున్నా పింఛన్ తీసుకునేందుకు అనంతపురంలోని ఓ సచివాలయానికి వచ్చిన వృద్ధురాలు

కుట్రలతో ఏడి'పింఛన్'

- పింఛన్ అందుకునేందుకు పండుటాకుల అవస్థలు
- సచివాలయాల వద్ద బారులు
- గంటల తరబడి పడిగాపులు
- పంతం నెరవేర్చుకున్న చంద్రబాబు
- మండిపడ్డ పింఛన్‌దారులు

అనంతపురం క్రైం: మంచి చేసే వారంటే ఆయనకు నచ్చదు. అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తారు. తన వారితో కలిసి కుట్రలు పన్నుతారు. లబ్ధి పొందుతున్న వారు పేదవారా, పండుటాకులా, ఏ అండా లేని వారా అనే దానితో సంబంధం లేదు. 'నేను చేయలేదు.. మీరూ చేయొద్దు' అంటూ రాళ్లు విసురుతారు. రాక్షసానందం పొందుతారు. తన అనుయాయులతో కలిసి ఆయన పన్నిన కుయుక్తులు.. నేడు పింఛన్‌దారులకు శాపంలా పరిణమించాయి. ప్రతి నెలా ఎంతో ఆనందంగా పింఛన్ అందుకునే వారు.. ఆ డబ్బు కోసం నేడు అవస్థలు పడాల్సి వచ్చింది.

బాబు తీరుతో కష్టాలు పునరావృతం..

చంద్రబాబు పాలనలో పింఛన్ అందుకోవాలంటే నానా కష్టాలు పడాల్సి వచ్చేది. పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. వృద్ధులు అనే కనికరం లేకుండా అప్పట్లో ఇబ్బందులు పెట్టేవారు. పింఛన్ డబ్బు కోసం వచ్చిన పలువురు అప్పట్లో ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ ఇబ్బందులన్నీ ప్రజా సంకల్పయాత్రలో తెలుసుకున్న వైఎస్ జగన్.. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టగానే వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి అవస్థలు దూరం చేశారు. పింఛన్‌దారులు ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లి డబ్బు అందించేలా చర్యలు తీసుకున్నారు. అయితే, ఎన్నో గొప్ప కార్యక్రమాలతో ఆయన తెచ్చుకున్న మంచి పేరును చూసి ఓర్వలేని టీడీపీ అధినేత చంద్రబాబు అనేక కుట్రలు పన్నారు. పండుటాకులకు నేడు అవస్థలు తెచ్చిపెట్టారు. బాబు కుటిల బుద్ధి కారణంగా మళ్లీ పాత రోజులు పునరావృతమవడం చూసి పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సక్రమంగా నడుస్తున్న వ్యవస్థను అడ్డుకున్న చంద్రబాబుపై పలువురు మండిపడ్డారు.

జిల్లాకు రూ.86.583 కోట్లు..

జిల్లాలో 2,89,131 మంది పింఛన్‌దారులకు సంబంధించి రూ. 86. 583 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటలదాకా సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ ప్రారంభించారు. ఇప్పటికే మూడు రోజులు ఆలస్యం కావడంతో పింఛన్‌దారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నడవలేని స్థితిలో ఉన్నవారు, వృద్ధులు ఆందోళనతో అష్టకష్టాలు పడుతూ సచివాలయాలకు వచ్చారు. పలు చోట్ల వృద్ధులను వారి బంధువులు మంచాలపై సచివాలయాలకు తీసుకొచ్చారు.

నాటి అవస్థలు కళ్లకు కట్టాయి..



ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి తలుపు తట్టి పింఛన్ సొమ్ము చేతిలో పెట్టేవాళ్లు. దీంతో కావాల్సిన మందులు, నిత్యావసర సరుకులు సమకూర్చుకునే వాళ్లం. చంద్రబాబు పుణ్యమా అని పరిస్థితి తారుమారైంది. టీడీపీ పాలనలో పింఛన్ కోసం రెండు, మూడు రోజుల పాటు మండుటెండల్లో పడిగాపులు కాసిన పరిస్థితులు కళ్లముందు కనిపించాయి.

– బాబయ్య, పింఛన్‌దారుడు, వేణుగోపాల్ నగర్, అనంతపురం

మంచి పనులను అడ్డుకుంటే ఎలా?



ముసలోళ్లు ఇబ్బంది పడకూడదని సీఎం వైఎస్ జగన్ ఇంటి వద్దకే పింఛన్ అందించే ఏర్పాట్లు చేశారు. వలంటీర్లు ప్రతి నెలా మొదటి రోజే మా వద్దకు వచ్చి డబ్బు ఇచ్చేవారు. కానీ, నేడు ఎవరో చేసిన నిర్వాకం కారణంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. పింఛన్ కోసం అష్టకష్టాలు పడి సచివాలయానికి వచ్చా. ఇక్కడ చూస్తే నాలాంటోళ్లు చాలా మంది అవస్థలు పడుతూ కనిపించారు.

– ఉమాదేవి, భాగ్యనగర్,అనంతపురం

మా శాపం తగలక మానదు



టీడీపీ పాలనలో పంచాయతీ కార్యాలయాల వద్దనో, సర్వర్ సమస్య అంటూ ఊరికి దూరంగానో ఇస్తున్నా అక్కడికే వెళ్లి పింఛన్ తీసుకునే వాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇబ్బందులు ఉండేవి కావు. మేం బాగుండేది ఇష్టం లేని చంద్రబాబు కష్టాలు పెడుతున్నాడు. ఆయనకు మా శాపం తగలక మానదు. టీడీపీకి ఓటు వేస్తే, ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్లే.

– తిప్పక్క, కెంచానపల్లి, రాయదుర్గం మండలం

ఓటమి భయంతోనే వలంటీర్లపై కక్ష



టీడీపీ నేతలు ఓటమి భయంతోనే వలంటీర్లపై కక్ష కట్టారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే వచ్చి నగదు అందించడమే వారు చేసిన తప్పా? ఏం పెద్దమ్మ, పెద్దయ్య బాగున్నావా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ సేవలందించడమే వారు చేసిన నేరమా? చేసిన పాపానికి చంద్రబాబు తప్పకుండా తగిన మూల్యం చెల్లించుకుంటారు.

– కుక్కపల్లి సంగన్న, కూడేరు

కన్నీటి పర్యంతమైన వృద్ధురాలు



తాడిపత్రిరూరల్: 'నడవడానికి కాళ్లు రావడం లేదు, నిలబడటానికి శక్తి లేదు. నేను ఎలా సచివాలయానికి వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలి' అంటూ ఎమ్మెల్యే పెద్దారెడ్డితో ఓ వృద్ధురాలు తన గోడు వెళ్లబోసుకోవడం అక్కడున్న వారందరినీ కలచి వేసింది. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నివాసముండే ఓ వృద్ధురాలు.. ఆయన వద్దకు వచ్చి కన్నీటి పర్యంతమైంది. మా లాంటి వారు చంద్రబాబుకు ఏం పాపం చేశామని కక్ష కట్టాడయ్యా అంటూ వాపోయింది. ఈ కష్టాలు రెండు నెలలేనని, త్వరలో అంతా మంచి జరుగుతుందని ఎమ్మెల్యే ఆమెకు భరోసా ఇచ్చారు.

పయ్యావుల ప్రలోభ పర్వం

టీడీపీ హయాంలో పెద్ద సంఖ్యలో దొంగ ఓట్లను చేర్పిన ఆయన.. ఇప్పటివరకూ జరిగిన ప్రతి ఎన్నికల్లో ఆ ఓట్ల ద్వారానే గట్టెక్కారు. నమ్మి గెలిపించిన ప్రజలను వంచిస్తూ 30 ఏళ్ల పాటు అవినీతి, అక్రమాలు సాగించారు. ఆయన మోసాలను గ్రహించిన ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమయ్యారు. అయితే, ప్రజల్లో తనపై వస్తున్న వ్యతిరేకతను గమనించిన ఆయన.. ప్రలోభాలకు తెరలేపారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఓటర్లకు వివిధ రూపాల్లో గాలం వేస్తున్నారు.

- మహిళలకు చీరలు.. యువతకు డిన్నర్లు
- దొడ్డిదారిన గెలవాలనే లక్ష్యంతో ఓటర్లకు గాలం
- డబ్బు వేసేందుకు ఫోన్‌పే నంబర్లు సేకరిస్తున్న వైనం



ఉరవకొండలోని చౌడేశ్వరీ కాలనీలో ఓటరు జాబితాతో ఉన్న టీడీపీ నాయకులను అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు (బైక్‌పై ఉన్న వ్యక్తి)



దొంగ ఓట్లతో గెలుపు..

ఉరవకొండ: గారడీ మాటలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుంటూ ఎమ్మెల్యేగా చలామణి అవుతున్న పయ్యావుల కేశవ్‌కు ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉరవకొండలో ఎన్నికలకు 40 రోజుల ముందుగానే ఆయన ప్రలోభాలకు తెరలేపడం ఈ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తోంది. ఓటర్లను మభ్య పెట్టేందుకు తన బ్యాచ్ ద్వారా ఆయన శ్రీకారం చుట్టారు.

వివిధ రూపాల్లో గాలం

ఓటర్లను ఎలాగైనా తన వైపు తిప్పుకోవాలనే ఉద్దేశంతో పలు రకాలుగా వారికి ఎమ్మెల్యే కేశవ్ గాలం వేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మహిళలకు చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అయితే, చాలా గ్రామాల్లో మహిళలు చీరలు వెనక్కి ఇస్తుండడంతో టీడీపీ నేతలు అయోమయ స్థితిలో ఉండిపోతున్నారు. ఇక.. ఎమ్మెల్యే కేశవ్ సోదరుడు, టీడీపీ నేత పయ్యావుల శీనప్ప ఉరవకొండలో వివిధ కులసంఘాలతో సమావేశాలు నిర్వహిస్తూ, ఆ మాటున వారికి డిన్నర్ల కోసమంటూ రూ.50 వేల వరకు అందిస్తున్నట్లు తెలిసింది.

త్వరలో డబ్బు ఫోన్ పే చేస్తారట..

ఎమ్మెల్యే కేశవ్ తన అనుచరులను నియోజకవర్గంలోని ఇంటింటికీ పంపి ప్రజల వివరాలు సేకరిస్తున్నారు. స్థానికంగా ఉండే టీడీపీ నాయకులతో పాటు అనంతపురం నుంచి వచ్చిన కొత్త వ్యక్తులు ఓటరు జాబితాతో ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఇతర ప్రాంతాల్లో ఎంత మంది ఉన్నారు తదితర వివరాలు సేకరిస్తున్నారు. కుటుంబ యజమాని ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్లు అడిగి తీసుకుంటున్నారు. త్వరలో డబ్బు అందుతుందని వారిని మభ్యపెడుతున్నట్లు సమాచారం. ఇలాంటి అరాచకాలను చాలా చోట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకుంటున్నా, దొంగచాటున కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

పదవీ కాంక్షతో ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు చేర్పి నాలుగుసార్లు ఎన్నికల్లో కేశవ్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నా దొంగ ఓట్లతో గట్టెక్కుతూ వస్తున్నారు. అయితే, కేశవ్ మోసాన్ని గ్రహించిన ఉరవకొండ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి బోగస్ ఓట్లు తొలగించాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వేలాది ఓట్లను అధికారులు తొలగించారు. ఈ క్రమంలోనే డైలమాలో పడ్డ పయ్యావుల కేశవ్.. ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలకు తెరతీశారు. అయితే, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలోని ఇంటింటికీ పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందడం, అదే మేర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీ పాలనను కోరుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

18న గెజిట్ నోటిఫికేషన్


- అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల చేయనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 14 వరకూ ఈవీఎంల ర్యాండమైజేషన్ చేపట్టి అనంతపురం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వాటిని పంపిస్తామన్నారు. చిరునామా మార్పునకు సంబంధించి ఫారం-8 దరఖాస్తులను ఈనెల 14 వరకూ మాత్రమే స్వీకరిస్తారన్నారు. రాజకీయ పార్టీలు అనుమతులు తీసుకుని ర్యాలీలు, బహిరంగ సభలు, ఇంటింటి ప్రచారం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సింగిల్ విండో డెస్క్ ద్వారా అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. అభ్యర్థుల నామినేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన డాక్యుమెంట్లు చెక్‌లిస్ట్ ప్రకారం సిద్ధం చేసుకోవాలన్నారు. 'సువిధ' పోర్టల్‌లో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రం కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసిన వెంటనే ఇవ్వాలని తహసీల్దార్లకు ఆదేశాలిచ్చామన్నారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియను పూర్తిగా చిత్రీకరిస్తామన్నారు. 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన కేటగిరీలో నమోదైన ఓటర్లను గుర్తించామన్నారు. ఆ ఓటర్ల ఇళ్లకు వెళ్లి సర్వే చేసి ఫారం-12డీ అందిస్తామన్నారు. సమావేశంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, పార్టీల ప్రతినిధులు ఉమాపతి, శ్రీనివాసులు, ఇమామ్‌వలి, మసూద్‌వలి, పవన్ కుమార్, ఈశ్వరప్రసాద్, శ్యామ్, బాలరంగయ్య, అంజయ్య పాల్గొన్నారు.

849 మందిపై కేసులు

అనంతపురం: మద్యం, ఇసుక అక్రమ రవాణాపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సారథ్యంలో దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే గత నెలలో చేపట్టిన దాడులు, ఇతర వివరాలను సెబ్ అదనపు ఎస్పీ జి. రామకృష్ణ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. మార్చి నెలలో 26,029 టెట్రా ప్యాకెట్లు పట్టుకున్నారు. 13,360 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 470 లీటర్ల నాటుసారా, 3,402 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. 581 కేసుల్లో 849 మందిని అరెస్ట్ చేసి 138 వాహనాలు సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై 64 కేసులు నమోదు చేయడంతో పాటు 70 మందిని అరెస్ట్ చేసి 70 వాహనాలు సీజ్ చేశారు. రూ.8.38 లక్షల జరిమానా విధించారు.

అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి



పెద్దవడుగూరు: మండల పరిధిలోని భీమునిపల్లి కొండలో చిరుత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గ్రామానికి చెందిన కూలీలు బుధవారం ఉపాధి పనుల నిమిత్తం కొండ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ దుర్వాసన రావడంతో పరిసరాల్లో గాలించారు. చిరుత కళేబరం కనిపించింది. గుత్తిలోని అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు చిరుత కళేబరాన్ని పరిశీలించి, నమూనాలు సేకరించారు. మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

కళ్యాణదుర్గం: ఎండలు మండిపోతున్న ప్రస్తుత రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. కళ్యాణదుర్గం అర్బన్ పరిధిలోని శంకరప్ప తోట కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలోని సిబ్బంది, పిల్లల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రీ స్కూల్ చిన్నారులతో రైమ్స్ చెప్పించారు. అంగన్‌వాడీలో చిన్నారులు ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, సూపర్‌వైజర్ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తాడిపత్రి అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన చల్లా స్వాతి (30)ని 2009లో తాడిపత్రిలోని శ్రీనివాసపురంలో నివాసముంటున్న దినేష్‌కుమార్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. గ్రానైట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న దినేష్‌కుమార్ వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో మరో యువతితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. ఈ విషయంగా తన భర్తను పలు మార్లు స్వాతి నిలదీసి చెడు అలవాట్లు మానుకోవాలని హితవు పలికింది. అయినా దినేష్‌కుమార్‌లో మార్పు రాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న స్వాతి ఆదివారం ఉదయం బాత్‌రూంలో కిటికీకి చున్నీతో ఉరి వేసుకుంది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను కాపాడి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు సూచన మేరకు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక బుధవారం ఆమె మృతి చెందింది. స్వాతి తల్లి సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అర్బన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు.

పోకిరీకి దేహశుద్ధి చేసేందుకు మహిళల యత్నం

- బైకు వదిలి పరారైన యువకుడు

పామిడి: వెకిలి చేష్టలకు పాల్పడిన ఓ పోకిరీని దేహశుద్ధి చేసేందుకు మహిళలు యత్నించారు. దీంతో తన ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి దుండగుడు పారిపోయాడు. బుధవారం మధ్యాహ్నం పామిడి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. పామిడిలోని బైపాస్ సమీపంలో వెంగమనాయుడు కాలనీలో నివాసముంటున్న ఓ వివాహిత బుధవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి తన బిడ్డను పిలుచుకుని ఇంటికి బయలుదేరింది. గుప్తా కాలనీలోకి చేరుకోగానే ఓ పోకిరీ ఆమెను తన వైపు చూడమంటూ సైగలు చేస్తూ దుస్తులు ఊడదీసి వికృత చేష్టలకు తెరలేపాడు. గత మూడు నెలలుగా ఈ వేధింపులను మౌనంగానే భరిస్తూ వచ్చిన ఆమె తాళలేకపోయింది. అదే సమయంలో అటుగా వెళుతున్న మహిళలను అప్రమత్తం చేయడంతో అందరూ కలసి పోకిరీ పట్టుకుని దేహశుద్ధి చేసేందుకు ప్రయత్నించారు. వారి బారి నుంచి తప్పించుకున్న దుండగుడు తన ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వార్ వన్ సైడ్

- జగనన్న గెలుపును ఆపే దమ్ము ఎవరికుంది?
- పదవుల కోసమే పరిటాల సునీత పాకులాట
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, పామిడి వీరా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) పైలా నరసింహయ్య, పామిడి వీరా

ఆత్మకూరు: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చి, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించిన సీఎం వైఎస్ జగనన్న గెలుపును ఆపే దమ్ము ఎవరికీ లేదని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వార్ వన్ సైడ్‌గా సాగుతోందని, 175కు 175 స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నాయకుడు పామిడి వీరాతో కలసి ఆత్మకూరులో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గెలుపు కోసం ఎంతటి నీచానికైనా టీడీపీ దిగజారుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే వలంటీర్ల వ్యవస్థను దెబ్బ తీశారన్నారు. ఫలితంగా ఎంతో మంది వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ సొమ్ము తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని, రేషన్ కార్డులు, పింఛన్లు తాము నిర్దేశించిన వారికే ఇస్తామని నారా లోకేష్ బాహాటంగానే చెబుతున్నారన్నారు.

ఐదేళ్ల తర్వాత ప్రజలు గుర్తుకొచ్చారా?

అధికారం కోల్పోయిన తర్వాత ఐదేళ్ల పాటు నియోజకవర్గ ప్రజల గురించి ఏ మాత్రం పట్టించుకోని పరిటాల సునీతకు ఎన్నికల సమయంలో మాత్రమే జనం గుర్తుకు వచ్చారని ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. కరోనా సమయంలో ఇంటి నుంచి కాలు కూడా బయటకు పెట్టని సునీత నేడు పదవి కోసం ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. ధర్మవరం టికెట్ ఇవ్వకపోతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్న పరిటాల శ్రీరామ్... నేడు సిగ్గు లేకుండా బీజేపీకి ఎలా మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు. సంక్షేమ పాలన వైఎస్ జగన్‌తోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు.

అభివృద్ధి అంటే ఏమిటో చూపించా

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రాప్తాడు నియోజకవర్గంలో శాంతి కుసుమాలు పూయించామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ ఐదేళ్లలో రెండున్నరేళ్లు కరోనా పరిస్థితులు పోను మిగిలిన రెండేళ్లలోనే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. పేరూరు డ్యామ్‌ను నీటితో నింపి బీడు భూములను మాగాణులుగా మార్చామన్నారు. రైతులకు ఉచిత బోర్లు వేయించి వ్యవసాయాన్ని సుసంపన్నం చేశామన్నారు. నిరుపేదల సొంతింటి కల సాకారమైందన్నారు. పీఏబీఆర్ నుంచి 110 గ్రామాలకు, గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 51 గ్రామాలకు తాగునీటి పథకాలు తీసుకువచ్చి పనులు చేయిస్తున్నామన్నారు. రామగిరి బంగారు గనుల ద్వారా 3 వేల మందికి ఉపాధి కల్పనకు కృషి చేశామన్నారు. 11.50 ఎకరాల్లో చేపట్టిన గార్మెంట్ పరిశ్రమ పనులు మరో నాలుగు నెలల్లో పూర్తవుతాయన్నారు. 8 వేల ఎకరాల్లో సోలార్ ప్లాంట్ తీసుకువచ్చామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువునూ నీటితో నింపుతున్నామన్నారు. మూడు రిజర్వాయర్ల నిర్మాణాలు, తాగునీటి పథకాలు, మరో 11 వేల పక్కా గృహ నిర్మాణాలూ పూర్తి చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపించమని కాకుండా 'మీకు మంచి జరిగి ఉంటేనే ఓటు వేయండి' అంటూ పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతటి నిస్వార్థపరుడో అర్థం చేసుకోవచ్చునని పైలా నరసింహయ్య, పామిడి వీరా అన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

గుంతకల్లు రూరల్: పీఈటీ అవమానకరంగా మాట్లాడడంతో మనస్తాపం చెందిన కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. కర్నూలు జిల్లా మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఆంజనేయులు కుమార్తె కావ్యశ్రీ... గుంతకల్లులోని కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. గత శనివారం స్నాక్స్ దొంగలించిందని ఆమెపై తోటి విద్యార్థులు నింద వేయడంతో పాటు పీఈటీ అనితకు ఫిర్యాదు చేశారు. తాను చోరీ చేయలేదని కావ్యశ్రీ ఎంత మొరపెట్టుకున్నా వినకుండా ఆమెను పీఈటీ చితకబాదింది. అనంతరం తరగతి గదిలో విద్యార్థులందరి ఎదుటే పదే పదే కావ్యశ్రీని దొంగగా అభివర్ణిస్తూ మాట్లాడింది. ఈ క్రమంలో బుధవారం మరోసారి విద్యార్థులు తమ స్నాక్స్ పోయాయని, వాటిని కావ్యశ్రీనే దొంగలించి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తూ మరోసారి పీఈటీ అనితకు ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన పీఈటీ... పాఠశాల మైదానంలో కావ్యశ్రీతో 30 రౌండ్లు పరుగులు తీయించింది. అక్కడితో ఆగకుండా తోటి విద్యార్థుల ముందు అవమానకరంగా మాట్లాడడంతో తీవ్ర మనోవేదనకు లోనైన కావ్యశ్రీ... మధ్యాహ్నం తన హాస్టల్ గదిలోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే సమాచారం ఇవ్వడంతో ఉపాధ్యాయులు కాపాడి గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సైతం ఆస్పత్రికి చేరుకున్నారు. ఘటనకు బాధ్యురాలైన పీఈటీపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. ఎంఈఓ మస్తాన్‌రావు ఆస్పత్రికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. అనంతరం కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడించారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన డైరెక్టర్ ఆదేశాల మేరకు పీఈటీ అనితను సస్పెండ్ చేస్తూ ఎంఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికల ప్రచారంలో అంగన్‌వాడీ కార్యకర్త, డీలర్



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డితో మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్త అనసూయ



టీడీపీ గుంతకల్లు అభ్యర్థి జయరాంతో రేషన్ డీలర్ గుర్రం గోపాల్

యాడికి/గుంతకల్లు రూరల్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి టీడీపీ అభ్యర్థుల తరఫున ప్రచారంలో అంగన్‌వాడీ కార్యకర్త, రేషన్ డీలర్ పాల్గొనడం వివాదాస్పదమైంది. వివరాలు... తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి గత మంగళవారం యాడికి మండలం రాయలచెరువులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అస్మిత్ రెడ్డితో ఆ ప్రాంతానికి చెందిన 7వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త అనసూయ మాట్లాడుతూ... కాలనీలో ఓట్లన్నీ టీడీపీకే వేయిస్తానంటూ భరోసానిచ్చింది. వీరిద్దరి సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పలువురు విస్తుపోయారు. ప్రభుత్వ ఉద్యోగులు కాకపోయినా రాజకీయ నాయకులతో మాట్లాడారంటూ జిల్లాలోని అనేకమంది వలంటీర్లను అధికారులు సస్పెండ్ చేశారు. అయితే అనసూయ మీద అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దామని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానించారు. అలాగే గుంతకల్లు మండలం అమీన్‌పల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ గుర్రం గోపాల్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాంతో కలసి బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం వివాదాస్పదమైంది.

నెట్టికంటుడి సన్నిధిలో యువతి ప్రసవం



అపస్మారకస్థితిలో ఉన్న తల్లి కాళ్ల మధ్యలో రోదిస్తున్న నవజాత శిశువు

గుంతకల్లు రూరల్: దిక్కులేని వారికి దేవుడే దిక్కు అన్న పెద్ద నానుడి నిజమైంది. మాయమాటలతో నమ్మించి లోబర్చుకున్న ప్రియుడు వద్దనుకున్న యువతిని తల్లిదండ్రుల నిరాదరణకు గురి చేయడంతో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధిలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు... ఓ యువకుడి మాయలో పడిన గుంతకల్లుకు చెందిన ఓ యువతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను మందలించారు. అయితే తల్లిదండ్రుల మాటను ఆమె పెడచెవిన పెట్టడంతో క్రమంగా కుటుంబసభ్యుల నిరాదరణకు గురైంది. ఈ క్రమంలో పెళ్లి కాకుండానే గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న ప్రియుడు కూడా మోసం చేయడంతో రోడ్డున పడిన ఆమె చివరకు చిన్నచితక పనులు చేసుకుంటూ కాలాన్ని నెట్టుకొచ్చింది. నెలలు నిండి పురిటి నొప్పులు మొదలవడంతో మంగళవారం గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి చేరుకుంది. ప్రసవం ఆలస్యమవుతుండడంతో వైద్యులను కలసి తనకు సిజేరియన్ చేయాలని కోరింది. ఆ సమయంలో కుటుంబసభ్యులను తోడుగా తెచ్చుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో దిక్కుతోచని ఆమె అక్కడి నుంచి బయలుదేరి పురిటి నొప్పుల బాధను అనుభవిస్తూనే కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుని రాత్రి గంగా నిలయం వద్ద బస చేసింది. నొప్పుల తీవ్రత తాళలేక అర్ధరాత్రి తర్వాత ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. ఆ సమయంలోనే పండంటి ఆడబిడ్డను ప్రసవించింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఈ విషయం వెలుగులోకి రాలేదు. కాసేపటి తర్వాత నవజాత శిశువు ఏడుపు వినిపించడంతో ఆలయ సిబ్బంది, దూరంగా ఉన్న కొద్దిపాటి భక్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అపస్మారక స్థితిలో ఉన్న యువతిని, నవజాత శిశువును గమనించి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

నీళ్ల బకెట్‌లో పడి బాలుడి మృతి



అఖిల్ మృతదేహం

పెద్దవడుగూరు: నీళ్ల బకెట్‌లో పడి ఓ బాలుడు మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పెద్ద వడుగూరు మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన శివకుమార్ యాదవ్, రాధ దంపతులకు ఓ కుమార్తె, ఏడాదిన్నర వయసున్న కుమారుడు అఖిల్ ఉన్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు తల్లి ఇంట్లో పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న అఖిల్ ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్‌లో తలకిందులుగా పడ్డాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదాన్ని గుర్తించలేదు. కాసేపటి తర్వాత ఇంటి బయటకు వచ్చిన తల్లి బకెట్‌లో నుంచి పైకి బాలుడి కాళ్లు కనిపిస్తుండడంతో గట్టిగా కేకలు వేస్తూ వెలికి తీసింది. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని వెంటనే పెద్దవడుగూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుడి సూచన మేరకు పామిడికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది.

ఆకర్షణీయంగా రైల్ కోచ్ రెస్టారెంట్

- గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో అందుబాటులోకి
- రేపు ప్రారంభించనున్న డీఆర్ఎం



రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు

గుంతకల్లు: ఇన్నాళ్లు పట్టాలపై ప్రయాణికులతో పరుగు తీసిన ఏసీ బోగీ.. నేడు విలాసవంతమైన రెస్టారెంట్‌గా గుంతకల్లు రైల్వే స్టేషన్ ఆవరణలో ఆకట్టుకుంటోంది. అదనపు ఆదాయంపై దృష్టి పెట్టిన రైల్వే అధికారులు రూపొందించిన కోచ్ రెస్టారెంట్‌ను శుక్రవారం డీఆర్ఎం వినీత్ సింగ్ ప్రారంభించనున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రెండవదిగా, రాష్ట్రంలో మూడోవదిగా ఈ కోచ్ రెస్టారెంట్ ఖ్యాతిగాంచనుండడం గమనార్హం. కాగా, ఈ రెస్టారెంట్ అందుబాటులోకి వచ్చి మూడేళ్లవుతోంది. అయితే టెండర్లను ఐదు సార్లు నిర్వహించిన అధికారులు నిర్ణయించిన ధర ఎక్కువగా ఉండడంతో ఎవరూ ముందుకు రాలేదు. దీంతో చివరకు గుంతకల్లుకు చెందిన ఓ కాంట్రాక్టరు రూ.26 లక్షలు చెల్లించి, నిర్వహణ హక్కులు దక్కించుకున్నాడు. ఈ ఏసీ కోచ్‌లో దాదాపు 40 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 80 మంది ఒకేసారి కూర్చోవచ్చు. 24 గంటలూ అల్పాహారం, భోజనాలు అందుబాటులో ఉంటాయి.

బడుల్లో 'వాటర్' బెల్

- రోజులో మూడు సార్లు మోగించాలి
- ఆ సమయంలో విద్యార్థులు నీళ్లు తాగేలా చూడాలి
- విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వ ఆదేశం
- పెరుగుతున్న ఎండల నేపథ్యంలో బడి పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

అనంతపురం ఎడ్యుకేషన్: సాధారణంగా స్కూళ్లలో ఉదయం బడి ప్రారంభానికి ముందు లాంగ్‌బెల్, ప్రార్థనకు ముందు బెల్, పీరియడ్ అయిన తర్వాత, ఇంటర్వెల్, ఆ తర్వాత భోజన సమయం, తిరిగి లోపలికి వచ్చే సయయం, సాయంత్రం ఇంటర్వెల్, బడి ముగిసిన తర్వాత లాంగ్ బెల్ కొట్టడం చూస్తుంటాం. ఇవికాకుండా ఇప్పుడు కొత్తగా మరో మూడుసార్లు ప్రత్యేకంగా 'వాటర్ బెల్' మోగనుంది. రోజురోజుకు భానుడు భగభగమంటున్నాడు. 42 డిగ్రీల పైగా దాకా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రమాదకర వేడిగాలులు వీస్తున్నాయి. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బడి పిల్లల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుత ఒంటిపూట బడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 'వాటర్ బెల్' మోగించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఎండ వేడిమికి విద్యార్థుల్లో డీహైడ్రేషన్ ముప్పును నివారించేందుకు రోజులో మూడు సార్లు వాటర్ బెల్ మోగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 8.45 గంటలకు, 10.50 గంటలకు, 11.50 గంటలకు వాటర్ బెల్ కొట్టేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రతిసారి 5 నిమిషాలు పాటు సమయం ఇవ్వాల్సి ఉంది.

అన్ని స్కూళ్లలో అమలు

అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో తప్పనిసరిగా 'వాటర్ బెల్' అమలు చేయాల్సిందేనని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని స్కూళ్లకు ఆదేశాలు జారీ చేశారు. డెప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని పూర్తిస్థాయిలో అమలు చేసేలా చూడాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థలు, ఇతరుల సహకారంతో మజ్జిగ పంపిణీ చేసేలా చూడాలని కోరారు. ప్రతి స్కూల్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని హెచ్ఎంలను ఆదేశించారు.

గుర్తు చేసి మరీ తాగేలా చూడండి

ఎండలు మండుతున్నాయి. పిల్లలు డీహైడ్రేషన్ బారిన పడకుండా మూడుసార్లు వాటర్ బెల్ కొట్టి నీళ్లు తాగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని స్కూళ్లకు పంపించాం. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గుర్తు చేసి మరీ పిల్లలు నీళ్లు తాగేలా చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు.

– బి.వరలక్ష్మి డీఈఓ

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నార్పల: మండల కేంద్రంలో చోటు చేసుకున్న హత్యకేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం నార్పల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖరరెడ్డితో కలసి డీఎస్పీ వెంకటశివారెడ్డి వెల్లడించారు. ఈ నెల 1న నార్పలలోని ఫర్టిలైజర్ దుకాణ యజమాని వీరభద్రను ప్రత్యర్థులు దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో హతుడి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో రఘుపతితో పాటు మరో బాల నేరస్తుడిని అరెస్ట్ చేశారు. వీరభద్ర, రఘుపతి ఇద్దరూ కలసి నార్పలలో ఎరువుల దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. కొన్నేళ్లుగా వ్యాపారం సజావుగా సాగింది. ఈ క్రమంలో ఆర్థిక లావాదేవీల విషయంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు నెలకొని విడిపోయి, వేర్వేరుగా ఎరువుల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. పోటీలో భాగంగా తన వ్యాపారాన్ని దెబ్బ తీయడంతో పాటు సంసారంలో గొడవలు రావడానికి కూడా వీరభద్రనే ప్రధాన కారణంగా భావించిన రఘుపతి అతనిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఎలాగైనా వీరభద్రను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుని సోమవారం సాయంత్రం తన దుకాణంలో పనిచేస్తున్న బాలుడితో కలసి వీరభద్ర దుకాణంలోకి చొరబడి వేటకొడవండ్లతో దారుణంగా నరికి హతమార్చారు. అనంతరం ఇద్దరూ ద్విచక్రవాహనంపై ఉడాయించారు. కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం నాయనపల్లి క్రాస్ వద్ద తచ్చాడుతున్న నిందితులను గుర్తించి, అరెస్ట్ చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన రెండు వేటకొడవళ్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పండు ఈగ నివారణ చర్యలు చేపట్టండి



పండు ఈగ ఆశించడంతో దెబ్బతిన్న మామిడి పండు

అనంతపురం అగ్రికల్చర్: పండు ఈగ, మసి తెగులు ఆశించడంతో మామిడి రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులకు ఢోకా ఉండదని ఉద్యాన శాఖ డీడీ నరసింహరావు తెలిపారు. మామిడి తోటలు చాలా వరకూ పిందె నుంచి కాయ పెరిగే దశలో ఉన్నాయన్నారు. ఇలాంటి తరుణంలో పండు ఈగ ఆశించిన కాయలు తొందరగా రాలిపోతాయన్నారు. పక్వానికి వచ్చిన కాయ కింది భాగంలో ఈగ పెట్టిన గుడ్ల నుంచి వచ్చిన పిల్ల పురుగులు కాయ లోపల కండ తిని దెబ్బ తీస్తాయన్నారు. ఆలస్యంగా కోతకు వచ్చే నీలం, తోతాపురి, నీలేషాన్ రకాల్లో పండు ఈగ సమస్య అధికంగా ఉంటుందన్నారు. నివారణలో భాగంగా ప్రతి 20 చెట్లకు ఒక ఆకర్షణ పళ్లెం ఉంచాలన్నారు. 200 మి.లీ లీటర్ల నీటిలో 10 మి.లీ మిథైల్ యూజినాల్, 20 మి.లీ మలాథియాన్ మందులు కలిపి పళ్లెంలో వేలాడదీస్తే మగ ఈగలు ఆకర్షితమై అందులో పడి చనిపోతాయన్నారు. అక్కడక్కడ లింగాకర్షక బుట్టలు, ఫ్రూట్ కవర్స్ ఏర్పాటు చేసుకున్నా పండు ఈగ నుంచి మామిడిని కాపాడుకోవచ్చునని తెలిపారు.

- రసం పీల్చే తేనెమంచు పురుగులు, పిండినల్లి విసర్జించిన తియ్యని పదార్థం ఆకులు, పిందెల మీద పడటం వల్ల నల్లటి మసిలా పెరుగుతుంది. దీని వల్ల కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడి కాయ సైజు తగ్గిపోవడం, రాలిపోవడం జరుగుతుంది. నివారణలో భాగంగా రసం పీల్చే పురుగులను ముందుగా అరికట్టాలి. 2 కిలోల గంజిపొడిని 3 లీటర్ల గోరువెచ్చని నీటిలో కలపడం ద్వారా 100 లీటర్ల ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. మసి తెగులు కనిపించే ప్రాంతాల్లో బాగా ఎండ ఉన్న సమయంలో ఈ గంజి ద్రావకాన్ని పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

క్లుప్తంగా

టీడీపీని చిత్తుగా ఓడిద్దాం



కరపత్రాలు అందజేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: టీడీపీ అధికారంలోకి వస్తే ముస్లిం మైనార్టీలకున్న 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తారు. ముస్లింల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని మేయర్ మహ్మద్ వసీం అన్నారు. బుధవారం స్థానిక గంగా గౌరి థియేటర్ వద్ద ఉన్న మస్జిద్ ఏ మున్వర్ సమీప ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని చిత్తుగా ఓడిద్దామన్నారు. సీఎంగా జగన్, ఎమ్మెల్యేగా అనంత వెంకటరామిరెడ్డిని గెలిపిస్తే మైనార్టీలు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ ట్రేడ్‌యూనియన్ నాయకులు కొర్రపాడు హుస్సేన్ పీరా, అలీషేర్ ఇసాక్, నాయకులు నియాజ్, ఖాజా, నదీమ్, షంషుద్దీన్, దాదు, గఫార్, రఫీ, షేక్షావలి, జావీద్, ఆసీఫ్, మన్సూర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

రాప్తాడురూరల్: పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం కామారుపల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. హిందూపురం ఎంపీ అభ్యర్థిని బోయ శాంతమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీపీ వరలక్ష్మి, ట్రేడ్ యూనియన్ బండి పవన్, యూత్ విభాగం మండల కన్వీనర్ కిరణ్‌కుమార్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, మాదన్న స్థానిక నాయకులు లోకనాథరెడ్డి, మూలి కృష్ణారెడ్డి, ఎర్రినాగులు, వై.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి, రోషిరెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

'వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణం పోయింది'

అనంతపురం మెడికల్: వైద్యుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం పోయిందంటూ మృతుల కుటుంబీకులు బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డు ముందు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, మృతుల కుటుంబీకులు తెలిపిన వివరా.. ఈనెల 2న రుద్రంపేటకు చెందిన ఆటోడ్రైవర్ హనుమేష్ (28) బుక్కరాయసముద్రం చెరువుకట్ట వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడ్డాడు. 108లో సర్వజనాస్పత్రికి అదే రోజు మధ్యాహ్నం 3:30 గంటలకు తీసుకొచ్చారు. వైద్యులు సిటీ స్కాన్, ఎక్స్‌రే తీసి నార్మల్‌గా ఉందని, ఎటువంటి ప్రమాదం లేదని చెప్పారు. దీంతో హనుమేష్‌ను కుటుంబీకులు ఇంటికి తీసుకెళ్లారు. ఈనెల 3న ఉదయం 11 గంటలకు హనుమేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆస్పత్రికి మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

అడ్మిట్ చేసుకోలేదు

ఈనెల 2న మధ్యాహ్నం 3:30 గంటలకు వస్తే రాత్రి వరకు బిడ్డను అడ్మిట్ చేసుకోకుండా ఎమర్జెన్సీ వార్డులోనే ఉంచారని మృతుడి తల్లిదండ్రులు వీరన్న, వరలక్ష్మి, సోదరుడు కుమార్ పేర్కొన్నారు. రాత్రి బాగా ఉందని చెప్పడంతో ఇంటికి తీసుకెళ్లామన్నారు. ఆ రోజు రాత్రి ఇక్కడే ఉన్నింటే ప్రాణం దక్కేదని కన్నీటి పర్యంతమయ్యారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎమర్జెన్సీ వార్డులో సర్జరీ, ఆర్థో వైద్యులు హనుమేష్‌కు చికిత్సనందించారన్నారు. రాత్రి కుటుంబ సభ్యులే అతన్ని ఇంటికి తీసుకెళ్లినట్లు డ్యూటీ వైద్యులు తెలిపారని చెప్పారు. హనుమేష్‌ను అడ్మిట్ చేయలేదన్నారు. ఈ ఘటనపై ఆర్ఎంఓ పద్మజ, హెచ్ఓడీలు డాక్టర్ రామస్వామి, డాక్టర్ శ్రీనివాసులతో విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.



బాబూ.. మాపై ఎందుకింత కక్ష?

- వృద్ధులు, వికలాంగుల ఆవేదన
- మండుటెండలో నడవలేని స్థితిలో పింఛన్ల కోసం సచివాలయాలకు రాక

అనంతపురం కార్పొరేషన్/కనగానపల్లి: టీడీపీ ఓర్వలేనితనం వృద్ధులు, వికలాంగులకు నరకయాతన చూపింది. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఉదయం 5 గంటల నుంచే సజావుగా సాగే పింఛన్ పంపిణీని పరోక్షంగా అడ్డుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పవన్ కళ్యాణ్ తీరుపై లబ్ధిదారులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో వృద్ధులు, వికలాంగులు కర్ర చేతిలో పట్టుకుని సచివాలయాల వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి పడిగాపులు కాశారు. నగరంలో 11 వేల మందికిపైగా వృద్ధులు, 3,800 మందికి పైగా వికలాంగులు, 6,500 మందికిపైగా వితంతువులు కలుపుకుని మొత్తం 23,500 మందికిపైగా పింఛన్ లబ్ధిదారులు అవస్థలు పడ్డారు. సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్, తదితర కార్యదర్శులు పింఛన్ సొమ్ము అందజేశారు. అందుబాటులో ఉన్న సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయాల్సి వచ్చింది. కాగా ఒకేసారి పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు సచివాలయాలకు రావడంతో గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కొన్నిచోట్ల అధికారులు వచ్చినా క్యూలైన్లలో నిలబడి పింఛన్ తీసుకోవటానికి వికలాంగులు చాలా ఇబ్బందులు పడ్డారు. తొలిరోజు కనగానపల్లి, రామగిరి, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లో కేవలం 10 నుంచి 20 శాతం మందికి మాత్రమే అధికారులు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతపురం అర్బన్‌లో కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో సాయంత్రం 5 గంటల నుంచి పింఛన్ ప్రక్రియ ప్రారంభమైంది.



చెన్నేకొత్తపల్లిలో సచివాలయం వద్ద పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు

వలంటీర్లే అన్నీ చూసుకునే వారు..



ఈ ఎండల్లో సచివాలయ దగ్గరకు వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటే చాలా కష్టంగా ఉంది. చంద్రబాబు తన రాజకీయ స్వార్థం కోసం ఇలాంటి కుట్రలు చేసి మాలాంటి వారికి ఇబ్బందులు కలిగించటం బాగా లేదు. గంటల కొద్దీ క్యూలైన్లలో నిలబడి పింఛన్ డబ్బులు తీసుకోవాల్సి వస్తోంది. మొన్నటి వరకు వలంటీర్లు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇంటి దగ్గరకే వచ్చి పింఛన్ డబ్బులు అందించేవారు. టీడీపీ నాయకులు రాజకీయ కుట్రలు చేసి ప్రజాసేవ చేసే వలంటీర్లను పక్కకు పెట్టించడం దుర్మార్గం

– జల్లయ్య, వృద్ధుడు ఎస్టీ కాలనీ, చెన్నేకొత్తపల్లి

చాలా ఇబ్బంది పడుతున్నాం



ప్రతి నెల ఒకటో తేదీ ఇంటి వద్దకు పింఛన్ ఇచ్చి వెళ్లే వలంటరీ వ్యవస్థ తీసుకువచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇరత రాష్ట్రాల ప్రజలు కూడా అభినందిస్తున్నారు. తను తీసుకువచ్చిన సంక్షేమ పథకాల ఫలాలు అలా ఉన్నాయి. అలాంటి పథకాలను తీసుకురాలేక పోయిన నేతలు ఏం చేయాలో తెలియక ఇలా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఇప్పటికే నాలుగు రోజులు ఆలశ్యం చేశారు. ఇందుకు కారణం ఎవరైనా ఇది సరైన విధానం కాదు.

– నారాయణస్వామి దివ్యాంగుడు, బిందెల కాలనీ

చంద్రబాబుది నీచబుద్ధి



టీడీపీ నేత చంద్రబాబు తన రాజకీయ స్వార్థం కోసం చాలా నీచబుద్ధితో వ్యవహరిస్తాడు. ప్రతి నెలా ఇంటి దగ్గరకు వచ్చి మాలాంటోళ్లకు పింఛన్లు ఇవ్వటంతో పాటు ప్రతి ప్రభుత్వ పథకం గురించి వలంటీర్లు చెప్పేవాళ్లు. ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లను పక్కకు పెట్టడం చాలా దారుణం. వచ్చే ఎన్నికల్లో ప్రజలే టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారు.

– లక్ష్మీదేవి, పేరూరు డ్యాం, రామగిరి మండలం

మధ్యాహ్నం నుంచి పడిగాపులు

పింఛన్ కోసం మధ్యాహ్నం నుంచి సచివాలయం వద్దే ఉన్నా. నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ వీళ్లు పింఛన్ ఆలస్యం చేస్తున్నారు. సచివాలయంలో ఎక్కువగా జనం ఉన్నారు. ఎప్పుడు పింఛన్ తీసుకుని ఇంటికి పోయేది. ఎవరితో చెప్పుకోవాలి మా బాధ. ఎండాకాలంలో ఇలా తిప్పుకోవడం బాగాలేదయ్యా. అదేదో వలంటీర్ల ద్వారా ఇప్పించింటే ఏమయ్యేది. టీడీపీ ఏదో ఫిర్యాదు చేస్తే వృద్ధులను ఇబ్బంది పెడుతారా?

– రామచంద్ర, కల్పనాజోష కాలనీ

బుద్ధి ఉన్నోళ్లు ఇలా చేయరు



బుద్ధి ఉన్నోళ్లు ఇలా చేయరు. ప్రతి నెలా ఇంటికి ఇచ్చే పింఛన్‌ను ఇవ్వకుండా చేస్తే ఎలా? మహానుభావుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాలాంటోళ్ల కోసం వలంటీర్లతో పింఛన్ ఇప్పించేవారు. టీడీపీ, జనసేన దొంగ పార్టీలు. పబ్లిక్‌గానే ఈ రెండు పార్టీలను కడిగేస్తా. నాలుగు వీధులు దాటుకుని వచ్చి పింఛన్ తీసుకోవాల్సిన గతి పట్టించారు.

– హైదర్‌వలి, వినాయకనగర్

బాబుకు ఇవే చివరి ఎన్నికలు



ప్రసన్నాయపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: కుట్ర రాజకీయాల్లో ఆరితేరిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అయ్యవారిపల్లి, ప్రసన్నాయపల్లి, చిన్మయనగర్, కళాకారుల కాలనీలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా అయ్యవారిపల్లిలో ఎరిస్వామి తాత, ప్రసన్నాయపల్లిలో పెద్దమ్మ ఆలయంలో పూజలు చేసి, ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాక్షేత్రంలో ప్రజలకు మంచి చేయాల్సిన చంద్రబాబు పింఛన్‌దారుల ఉసురు పోసుకుంటున్నారంటూ మండిపడ్డారు. ఐదేళ్లుగా వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి పింఛను ఇస్తున్నారని.. ఇప్పుడు చంద్రబాబు సకాలంలో పింఛన్ దక్కకుండా అడ్డుపడ్డారని విమర్శించారు. పింఛన్ తీసుకునేందుకు వెళ్లి ఒక వృద్ధుడు ఎండ వేడిమి తట్టుకోలేక మృతి చెందిన సంఘటన చోటు చేసుకుందన్నారు.

అభివృద్ధి పథంలో రాప్తాడు నియోజకవర్గం

నియోజకవర్గంలో రూ.9 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.3 వేల కోట్ల సంక్షేమ పథకాలను అందజేయడం జరిగిందన్నారు. జగనన్న సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గంలో 80 వేల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 17 వేల మందికి ఇళ్లను మంజూరు చేయించామన్నారు. మరో 17 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని తెలిపారు. మరో 10 వేల మందికి ఇళ్ల పట్టాలను ఇచ్చేందుకు సిద్ధం చేశామన్నారు. గార్మెంట్ పరిశ్రమల ద్వారా 4 వేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి 10 వేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సొసైటి చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, బుక్కచెర్ల సొసైటీ అధ్యక్షుడు కుర్లపల్లయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, విజయ్ వర్ధన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రవీంద్రా రెడ్డి, మనోహర్, నరేష్, ఉషా, పద్మావతి, షాను, భాగ్యమ్మ పాల్గొన్నారు.

మూడేళ్లలో నగరం రూపురేఖలు మార్చేశాం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 35వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమం



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలో కోవిడ్ మహమ్మారి వచ్చింది. దాదాపుగా రెండేళ్ల పాటు కోవిడ్‌తో కాలం గడిచిపోయింది. కానీ ప్రజలకందించే సంక్షేమంలో ప్రభుత్వం వెనుకడుగు వేయలేదు. రెండేళ్ల తర్వాత ప్రాధాన్యత క్రమంలో రూ.800 కోట్లతో నగరం రూపురేఖలను మార్చేశామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 35వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు, కాలువలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు విమర్శలు, దాడులు చేసుకోవడానికే కాలం సరిపోయిందన్నారు. రావాలి జగన్.. కావాలి జగన్ కార్యక్రమంలో భాగంగా మీ వద్దకు వచ్చినప్పుడు ఒక్క అవకాశం ఇవ్వాలని తాము కోరామన్నారు. 2019లో అవకాశం ఇచ్చారని.. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి చేసి చూపామన్నారు. మరోమారు ఎన్నికలు వస్తున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. మరోసారి రెట్టింపు సంక్షేమం, అభివృద్ధిని అందిస్తామన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్ష టీడీపీ, తోక పార్టీ జనసేన, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు.

35వ డివిజన్‌లో రూ.5 కోట్లకుపైగా అభివృద్ధి

35వ డివిజన్‌లోని మారుతీనగర్, శ్రీనగర్‌కాలనీ, నాయీబ్రాహ్మణ కాలనీ, తదితర ప్రాంతాల్లో రూ.5 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల తర్వాత మరో రూ.4 కోట్ల అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. రూ.కోటితో శ్రీనగర్ కాలనీ 80 అడుగుల రోడ్డు, రూ.40 లక్షలతో కిమ్స్ సవీరా వెళ్లే మార్గంలో బీటీ రోడ్డు, శ్రీనగర్ కాలనీ శివారులో రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో అర్బన్ సెంటర్ ఆధునీకరణ, మంగళవారీ కాలనీలో రూ.30 లక్షలతో అంతర్గత రోడ్డు, రూ.10 లక్షలతో సీసీ కాలువలు, రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు కొండ్రెడ్డి రాధ, సాకే చంద్ర, కమల్‌భూషణ్, దుర్గాదేవి, ఇసాక్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, కృష్ణవేణి, నాయకులు లోకనాథ్ రెడ్డి, నరసింహులు, శీన, భాస్కర్, రాజేష్, వెంకట్‌రెడ్డి, జానీ, నాగేంద్ర రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రామయ్య, వనారస బలరాం, జావెద్, అనిల్‌కుమార్ గౌడ్, ఓబులేసు, నిహార్ రెడ్డి, తనీష, రాధా, భూమిరెడ్డి జాహ్నవి, అంకిరెడ్డి ప్రమీళ, దేవి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపే ప్రజల అడుగులు



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైలా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలు



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయీ బ్రాహ్మణులు

ఆత్మకూరు: అభివృద్ధి వైపే ప్రజలు అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కుర్లపల్లి, ఆత్మకూరుకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పామిడి వీరా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగిందన్నారు. టీడీపీ హయాంలో ఏమైనా పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ ద్వారా అందేవన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో ఇంటి వద్దకే వచ్చి పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

పార్టీలో చేరిన వారు వీరే

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో కుర్లపల్లికి చెందిన బాలకృష్ణ, గంగాధర్, ముత్యాలు, వెంకటేష్, విశ్వనాథ్, నాగన్న, నారాయణ, హరి ఉన్నారు. ఆత్మకూరుకు చెందిన వారిలో మహేంద్ర, పెద్దన్న, లోకేష్, వేణు, మహేష్, సుజయ్ కుమార్ ఉన్నారు. ఆత్మకూరు బీసీ కాలనీకి చెందిన రమేష్, శివ, పవన్, సతీష్, ఫణి, నీలకంఠ, నరసమ్మ, సుబ్బమ్మ, వన్నూరమ్మ తదితరులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

ఆత్మకూరు పాత బస్టాండ్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లన్న, అనిల్, వాసుదేవరెడ్డి, నాగరాజు, మధు, పెద్ద కొండారెడ్డి, వెంకట్రాముడు, ఫణిరెడ్డి, బాలస్వామిరెడ్డి, శివారెడ్డి, కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్, హనుమంతు నాయక్, వెంకటేష్, మురళి, శ్రీరామ్, రాజశేఖర్, తరుణ్, కబాబ్ ఎర్రిస్వామి, అక్కులప్ప, దామోదర్‌రెడ్డి, అశోక్, లక్ష్మీ నారాయణరెడ్డి, గోపాల్, పెద్దన్న, వెంకటేష్, రామాంజి పాల్గొన్నారు.

డిప్లొమాతో ఉజ్వల భవిత

అనంతపురం: డిప్లొమా పూర్తి చేసిన వారికి తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2024కు సంబంధించి ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. విద్యార్థులు మంచి ర్యాంక్‌లు దక్కించుకునేలా ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతపురంతో పాటు నార్పల, ఉరవకొండ, గుంతకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, తాడిపత్రిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలి రోజు శిక్షణకు 244 మంది హాజరయ్యారు.

పి.యాలేరులో ప్రచారం జోరు



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి ఓటు వేయాలని కోరుతున్న నాయకులు

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరులో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సీఎం జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. 2014లో చంద్రబాబు 600 అబద్ధపు హామీలు ఇచ్చారని.. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. మోసపూరిత హామీలతో ఏకమైన కూటమిని బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు మండలానికి తాగునీటి పైప్‌లైన్ వేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో శాశ్వతంగా నీటి సమస్యకు పరిష్కారం చూపారన్నారు. చాలా మందికి ఉచితంగా బోర్లు వేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, సర్పంచ్ ఆరోగ్యంరెడ్డి, ఓబులేష్, ఎర్రిస్వామి, వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్, ఎంపీటీసీ ఓబులేసు, నాయకులు వాసుదేవరెడ్డి, ఆతిక్‌రెడ్డి, జయరామిరెడ్డి, జయన్న, బుట్టా రామకృష్ణ, శేఖరప్ప, కృష్ణానాయక్, చెన్నారెడ్డి, అంజినప్ప, పెద్దన్న, నాగన్న, మహేష్, వెంకటేష్, దామోదర్‌రెడ్డి, పడిగిరెడ్డి, జోజిరెడ్డి, చిన్న తిప్పారెడ్డి, నరసింహులు, అమర్‌నాథ్‌రెడ్డి, వన్నూరప్ప, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: నగరంలోని కోవూరునగర్‌లోని నిమ్రా మసీదులో బుధవారం రాత్రి మేయర్ వసీం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. కార్పొరేటర్ రహంతుల్లా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయభాస్కరరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, ఏకేఎస్ ఫయాజ్ తదితరులు ఉపవాస దీక్షాపరులతో కలిసి ఇఫ్తార్ విరమించారు. కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, ఇసాక్, కమలభూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండ్రెడ్డి ప్రకాశ్ రెడ్డి, శివారెడ్డి, నిహార్‌రెడ్డి, మహబూబ్ బాషా, షంషుద్దీన్, జావీద్, నవీద్, ఖాజా పాల్గొన్నారు.

ఐదుగురి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యల్లో భాగంగా ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ బుధవారం ఐదుగురిని సస్పెండ్ చేశారు. శింగనమల మండలం ఆకులేడు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సి.గంగాధర్‌రెడ్డి, ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామ వాలంటీర్లు డి.నాగరాజు, పి.రాజు, పి.వన్నూరుస్వామి, డి.సిద్దప్ప సస్పెన్షన్‌కు గురయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీముల ద్వారా ఇప్పటి వరకు రూ.1,81,12,490 నగదు సీజ్ చేశారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఇప్పటి వరకు రూ.40.50 లక్షలు విలువ చేసే 8,234.08 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి

అనంతపురం: అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు పెంపొందించుకుని గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి అన్నారు. క్యాంపస్ కళాశాలలోని ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎంవీ రామశర్మ స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణ కుమారి అధ్యక్షత వహించగా, ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీఎస్ రాజేంద్ర ప్రసాద్ విశిష్ట వక్తగా హాజరై మాట్లాడారు. ప్రొఫెసర్ వీఎస్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఇంగ్లిష్ అంతర్జాతీయ భాష మాత్రమే కాకుండా అంతర సాంస్కృతిక, బహుళ సాంస్కృతిక భాష అని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, సదస్సు కన్వీనర్ డాక్టర్ మాధవి, టీచింగ్ అసిస్టెంట్‌లు హుస్సేన్‌వలి, షకీలా, రామకృష్ణ, ఉమాదేవి పాల్గొన్నారు.